నేడు శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవం

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలో ముఊ్వరు స్వాముల రథోత్సవాన్ని బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల 10నుంచి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం ముఖ్య ఘట్టం. శ్రీలక్ష్మీనృసింహుడితోపాటు శ్రీవేంకటేశ్వర, రామలింగేశ్వర స్వాములను రథాలపై ఆశీనులు చేసి నంది కూడలి వరకు రథాలపై శోభాయాత్ర చేపట్టనున్నారు. రథోత్సవం ముగిసిన అనంతరం ఉత్సవమూర్తులను గోదావరికి తీసుకెళ్లి చక్రస్నానం, ఇతర పూజలు చేస్తారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా॥)	సహర్ గురువారం (ఉ॥)
కరీంనగర్ :	6.29	5.01
పెద్దపల్లి :	6.32	5.00
సిరిసిల్ల :	6.27	5.09
జగిత్యాల :	6.33	4.59

న్యూస్‌రీల్

నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి అనంతరం ఆలయాల్లో మొక్కులు చెల్లించారు. భక్తులకు ఓల్డ్ టీటీడీ కల్యాణ మండపంలో అన్నప్రసాద వితరణ చేశారు.

ఖోఖో రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా నవీన్‌కుమార్



కథలాపూర్: ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీల తెలంగాణ జట్టు కెప్టెన్‌గా కథలాపూర్ మండలం భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్ పీడీ నవీన్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 21 నుంచి 24 వరకు ఢిల్లీలో ఈ పోటీలు జరగనున్నాయి. తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా నవీన్‌కుమార్ ఎంపిక కావడంపై పాఠశాల హెచ్ఎం నల్ల రాజయ్య, పీడీలు అభినందించారు.

బీసీలకు రూ.30వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న ముసిపట్ల లక్ష్మీనారాయణ

జగిత్యాలటౌన్: బడ్జెట్‌లో బీసీలకు రూ.30వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు. 42శాతం రిజర్వేషన్ అమలయ్యేలా అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తిరుపురం రాంచంద్రం, బండపెల్లి మల్లేశ్వరి, బొమ్మిడి నరేష్, హృషికేశ్ ఉన్నారు.

రెండోరోజు కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళన

జగిత్యాలటౌన్: ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని, కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయొద్దని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన ఆందోళన మంగళవారం రెండోరోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించి కలెక్టరేట్ పాలనాధికారికి వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా కో-కన్వీనర్ కోమటి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి స్వప్న, జయప్రద, సరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థతతోనే ఎండుతున్న పంటలు



పంటలను పరిశీలిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతోనే పంటలు ఎండుతున్నాయని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లిలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. డీ–53 కెనాల్ నుంచి నీరు విడుదల చేసి పంటలు ఎండిపోకుండా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చేతగాని ప్రభుత్వంలో రైతన్నల జీవితాలు అస్తవ్యస్తం అవుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో మండుటెండల్లో కూడా చెరువులు మత్తళ్లు దూకాయని, మళ్లీ కేసీఆర్ పాలన వస్తేనే రైతు జీవితాలు బాగుపడతాయని వివరించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు అంజయ్య, గంగారెడ్డి, గంగాధర్, రాజేశ్, శంకర్, దుబ్బరాజం, వెంకన్న, రాములు, వెంకటేశ్, ఆదిరెడ్డి, శేఖర్, రైతులు లైొట్టి వెంకటేశ్, జక్కుల వెంకట్ పాల్గొన్నారు.

వామ్మో.. డంపింగ్ యార్డులు

- తగలబడుతున్న చెత్తాచెదారం
- కాలుష్యం బారిన పడుతున్న ప్రజలు
- నిరుపయోగంగా పొడి వనరుల కేంద్రాలు
- నిర్వహణ లేక వ్యాపిస్తున్న దుర్వాసన

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని దంపింగ్ యార్డు. యార్డులో కొద్దిరోజులుగా నిత్యం మంటలు అంటుకుంటున్నాయి. వెలువడే పొగ అక్కడున్న న్యాక్ కేంద్రంలోని విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సెగ్రిగేషన్ వ్యవస్థ లేకపోవడంతో తరచూ మంటలు అంటుకుంటున్నాయి. న్యాక్ కేంద్రం సమీపంలో చెత్త పోయొద్దని శిక్షణ పొందుతున్న అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని సెగ్రిగేషన్ చేసే కేంద్రం. తడి, పొడి చెత్త వేరు చేయడం లేదు. ప్లాస్టిక్‌కు సంబంధించిన వ్యర్థాలను వేరు చేస్తున్నారే తప్ప తడి, పొడిచెత్త వేరు చేయడం లేదు. గతంలో మహిళా సంఘాలకు ఇచ్చినప్పటికీ వారు సక్రమంగా చేయకపోవడంతో ప్రస్తుతం ఎన్విరాన్‌మెంటల్ అధికారులే చూస్తున్నారు.



- ఇది జిల్లా కేంద్రంలో వృథాగా ఉన్న ఎరువులు తయారుచేసే కేంద్రం. తడి, పొడి చెత్త వేరు చేసిన అనంతరం దీంట్లో సేంద్రియ ఎరువును తయారుచేస్తారు. ఆ ప్రక్రియ లేకపోవడంతో వాటి కోసం నిర్మించిన షెడ్లు వృథాగానే ఉన్నాయి. ఎరువులు తయారు చేస్తే బల్దియాకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



- ఈ చిత్రం జిల్లా కేంద్రంలోని డంపింగ్ యార్డు పక్కనే నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు. వాటి పక్కనుంచే రోడ్డు ఉంది. చెత్త నిత్యం కాలడం.. పొగ నేరుగా చివరన ఉన్న డబుల్‌బెడ్‌రూమ్‌లకు వెళ్లడం ఇబ్బందిగా మారింది.



- ఇది ధర్మపురిలోని తడి, పొడి చెత్త నిర్వహణ కేంద్రం. అర్ధంతరంగా నిలిచిపోయింది. స్థలం కొరత ఏర్పడటంతో కేంద్రం పనులు ముందుకు సాగడం లేదు. తడి, పొడి చెత్త ప్రక్రియ కొనసాగడం లేదు. ఫలితంగా ఎక్కడబడితే అక్కడే చెత్త పడేస్తున్నారు.



- ఇది మెట్‌పల్లి శివారులోని డంపింగ్‌యార్డు. తడి, పొడి చెత్త వేరు చేయకపోవడంతో కుప్పలు తెప్పలుగా పడి ఉంది. ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్తను డంపింగ్‌యార్డుకు తీసుకొచ్చి పోస్తున్నారు. సెగ్రిగేషన్ చేపట్టి మున్సిపల్‌కు ఆదాయం వచ్చేలా చూడాలంటున్నారు జనాలు.



- ఇది రాయికల్‌లోని డంపింగ్‌యార్డు. ఇక్కడ తడి, పొడి చెత్త సేకరణ లేకపోవడంతో బయటన పడేస్తున్నారు. రాత్రిపూట మంటలు అంటుకోవడంతో ఇళ్లలోకి పొగ వస్తోందని చుట్టుపక్కల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాల: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం.. సిబ్బంది పట్టింపు లేని ధోరణితో జిల్లాలోని ఐదు బల్దియాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం సేకరించే తడి, పొడి చెత్త గురించి పట్టించుకోకపోవడం సమస్యగా మారింది. మహిళలకు అవగాహన లేక రెండు కలిపే ఇస్తున్నారు. వాటిని అలాగే తీసుకెళ్లి డంపింగ్‌యార్డులో పోస్తున్నారు. దీంతో అక్కడ మంటలు అంటుకుని నిత్యం పొగ వ్యాపించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాకేంద్రంలో నూకపల్లి ప్రాంతంలోని డంపింగ్‌యార్డులో నిత్యం మంటలు అంటుకున్నాయి. అక్కడ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, న్యాక్ కేంద్రం ఉన్నాయి. పొగంతా అటుఇళ్లు.. ఇటు న్యాక్ కేంద్రాన్ని చుట్టుముట్టుతోంది. ఈ సమస్య ప్రతి మున్సిపాలిటీలోనూ నెలకొంది.

కాలుష్య కోరల్లో కాలనీలు

డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్త సేకరణ చేపట్టకపోవడంతో నిత్యం మంటలు అంటుకుని కాలనీలన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. బల్దియా నిబంధనల ప్రకారం చెత్తను కాల్చకూడదు. కాలుష్యంతో నిండిన పొగతో గుండె, ఊపిరితిత్తులపై అధిక ప్రభావం పడుతుంది. మనుషుల ఆరోగ్యంతోపాటు, పర్యావరణాన్ని దెబ్బతీసే కాలుష్య కారకాల్లో పీఎం 2.5, పీఎం 10, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ ఆక్సైడ్ ఉంటాయి. గాలిలో పీఎం 2.5 స్థాయికి పెరిగేకొద్దీ వృద్ధులు, పిల్లలు శ్వాసకోశ వ్యాధులున్న వారిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. డంపింగ్‌యార్డులో పొగలు అంటుకోకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం బల్దియాలపై ఉంది.

చెత్తశుద్ధి కేంద్రాన్ని ఉపయోగంలోకి తేవాలి



ధర్మపురి శివారులో ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలి. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ కేంద్రం ఇప్పటివరకు నిరుపయోగంగానే ఉంది. ఈ చెత్త కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తే మున్సిపాలిటీకి ఆదాయం రావడంతోపాటు, డంపింగ్‌యార్డులో చెత్త పేరుకుపోదు.

– మహేశ్, ధర్మపురి

చెత్తను వృథా చేయకూడదు



తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువులు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఇళ్ల నుంచి తీసుకెళ్తున్న చెత్తను డంపింగ్‌యార్డులోనే పడేస్తున్నారు. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతోంది. అధికారులు స్పందించి చెత్తను వినియోగంలోకి తేవాలి.

– శంకర్, మెట్‌పల్లి

డంపింగ్‌యార్డు పొగతో ఇబ్బందులు



ఒడ్డెరకాలనీ సమీపంలోనే డంపింగ్‌యార్డు ఉంది. పట్టణంలో సేకరించిన చెత్తనంతా ఇక్కడే పోస్తున్నారు. రాత్రి సమయంలో చెత్తకు నిప్పంటించడంతో పొగ వ్యాపిస్తోంది. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అనారోగ్యానికి గురవుతున్నాం.

– భీమన్న, రాయికల్

తడి, పొడి చెత్త వేరుగా సేకరించాలి



తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. కాలనీలకు వాహనాలు వస్తున్నా అంతా కలిపే తీసుకుంటున్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలి. డంపింగ్‌యార్డుల్లో చెత్తనంతా ఒకే చోట పోయడంతో నిత్యం మంటలు అంటుకుంటూ అందరికీ ఇబ్బందికరంగా మారింది. పొడి వనరుల కేంద్రాన్ని వినియోగంలోకి తేవాల్సి ఉంది.

– సుమన్, జగిత్యాల

‘భట్టి’ బడ్జెట్‌పై ఆశలు

- స్మార్ట్ సిటీకి నిధులు దక్కేనా?
- నిజాం షుగర్స్ పై ప్రకటనపై ఉత్కంఠ
- పత్తిపాక రిజర్వాయర్ పనులు మొదలయ్యేనా
- రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులపై ఉమ్మడి జిల్లాలో ఆసక్తి

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పలు పెండింగ్, కొత్త ప్రాజెక్టులకు వచ్చే నిధులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్మార్ట్ సిటీ, జగిత్యాల మెడికల్ కాలేజీ, ముత్యంపేట షుగర్స్ ఫ్యాక్టరీ, పత్తిపాక రిజర్వాయర్‌కు ఎంత కేటాయిస్తారన్న దానిపై ఉమ్మడి స్పష్టత రానుంది.

- కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నిధులు కరీంనగర్ కార్పొరేషన్ కు రావాల్సి ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం కేంద్రం నుంచి రూ.429 కోట్లు, రాష్ట్రం నుంచి రూ.399 కోట్లు విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో మిగిలిన రూ.30 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాలని ఇటీవల మాజీ మేయర్ సునీల్ రావు సీఎంకు లేఖ రాశారు. ఈ నిధులపై బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని బల్దియా అధికారులు ఆశాజనకంగా ఉన్నారు.
- మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామం నిజాంషుగర్స్ బకాయిలు మొత్తం రూ.250 కోట్లు ఉన్నాయి. తొలుత రూ.43 కోట్లు, తర్వాత అది రూ.192 కోట్లకు చేరింది. మిగిలిన బకాయిలు కూడా త్వరలోనే ఇవ్వనుంది. ఫార్చున్ కన్సెల్టెన్సీ ప్రతినిధులను పిలిచి ముత్యంపేట ఫ్యాక్టరీ రిపేరు చేయాలా? కొత్తది ఇన్‌స్టాల్ చేయాలా? అన్న విషయాలపై నివేదిక ఇవ్వమంది. మరమ్మతులకు రూ.50 కోట్ల వరకు ఖర్చవుతుందని.. ఒకవేళ నడిపినా పదేపదే మరమ్మతుల కారణంగా నష్టాలు వస్తాయని చెప్పింది. లాభాలు రావాలంటే కొత్త ఫ్యాక్టరీ పెట్టాలని నివేదిక ఇచ్చింది. ఈ బడ్జెట్లో దీనిపై ప్రభుత్వం ఏనిర్ణయం తీసుకుంటుందోనని తీసుకోనుందని ఉత్కంఠగా మారింది.



- 2022–23 మెడికల్ కళాశాల ప్రారంభం అయ్యింది. దీని హాస్టల్స్ భవన నిర్మాణానికి 500 కోట్లనిధులు మంజూరు అయ్యాయి. ధరూర్ క్యాంపులో 27.5 ఎకరాలు కేటాయించారు. ఇప్పటివరకు విడుదలైన రూ. 30 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయి. ఇంకా 360 బెడ్స్ ఆసుపత్రి నిర్మాణం కావాల్సి ఉంది. ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రిలోని కొనసాగుతుంది. ఈ సారి బడ్జెట్లో మరిన్ని నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టు భూములకు నీరు అందించి స్థిరీకరణ చేసేందుకు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక వద్ద ఒక రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. దానికి బడ్జెట్లో చోటుఇస్తారని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్ కు ఆదేశించారు. సుమారు రూ.2 వేల కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుపై ఎలాంటి ప్రకటన ఉంటుందో చూడాలి.

వైద్య కళాశాల విద్యార్థుల మధ్య వాగ్వాదం

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని కృష్ణానగర్‌లోగల మెడికల్ కళాశాల బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థుల మధ్య మంగళవారం వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తతకు దారితీసింది. కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డబ్బుల వసూలు విషయంలో మొదటి సంవత్సరం, తృతీయ సంవత్సరం విద్యార్థుల మధ్య విభేదాలు రావడంతో హాస్టల్ వద్ద వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై కిరణ్ హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి శాంతింపజేశారు.

చివరి ఆయకట్టుకు నీరు చేరాలి

గొల్లపల్లి: చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చూడాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని లోత్తునూర్ గ్రామంలో డీ–64, డీ–53 డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ను మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. కాలువల్లోని పిచ్చిమొక్కలను తొలగించాలని, మరమ్మతు ప్రతిపాదనలు పంపిస్తే ఉపాధి పథకం నుంచి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఇరిగేషన్ ఈఈ ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

వైద్యసేవలు మెరుగుపర్చాలి

ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్, ఐపీ రికార్డ్స్, మెడికల్, ఫార్మసీని పరిశీలించారు. ఓపీ సేవలు పెంచాలన్నారు.



డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పిచ్చిమొక్కలను తొలగించాలని ఆదేశించారు.

సాగునీటికి ఇబ్బంది రానీయొద్దు

వెల్గటూర్ : సాగునీటికి ఇబ్బంది రానీయొద్దని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని కుమ్మరిపల్లి వద్ద డీ–3, డీ–54 కెనాల్‌ను పరిశీలించారు. చివరి ఆయకట్టు రైతులకు నీరు అందించాలన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలి

జగిత్యాల: జిల్లాలో 3500 ఎకరాల్లో ఆయిల్ పాం సాగుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం ఉద్యాన శాఖ అధికారులతో సమావేశమయ్యారు. రానున్న మూడు నెలల్లో మండల వ్యవసాయాధికారులు తమ గ్రామాల పరిధిలో 50 ఎకరాల్లో మొక్కలు నాటేలా చూడాలన్నారు. ఆయిల్ పాం సాగుతో కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు.



అసెంబ్లీలో మనోళ్ల వాయిస్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో తమ గళం వినిపించారు. తమతమ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలు.. కావాల్సిన నిధులు.. సదుపాయాలను గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎవరెవరు ఏమన్నారంటే..

ఎస్సీ బిల్లు హర్షణీయం



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం రాష్ట్రప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. మందకృష్ణ మాదిగ సుమారు 30 ఏళ్లుగా అనేక పోరాటాలు చేశారు. గతంలో అనేకసార్లు హామీలు ఇచ్చినా వర్గీకరణకు ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకొచ్చి వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం హర్షణీయం. ఈ బిల్లుతో ఎస్సీల్లోని అన్నివర్గాలకు మేలు జరుగుతుంది.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్

సాగునీటి పథకాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కవ్వంపల్లి

ఇల్లంతకుంట(మానకొండూర్): మానకొండూర్ నియోజకవర్గం పరిధి లోని ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో రంగనాయకసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన ఎల్ ఎం–6 కాలువ పనులు పూర్తి చేయాలని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల పరిధిలోని రైతులు రిలే దీక్ష చేస్తున్నారు. కాలువ ప్రభావిత గ్రామాలను సిరిసిల్ల, సిద్దిపేట ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. కాలువ పనులకు రూ.3.19 కోట్లు మంజూరు చేయాలి. నియోజకవర్గంలో ఒక హై లెవెల్ బ్రిడ్జి అవసరం ఉంది.

– కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్ ఎమ్మెల్యే

దేశానికే రోల్‌మోడల్



మాట్లాడుతున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ నిలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని అన్నింటా అగ్రగామిగా ముందుకు సాగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణన చేపట్టి కాంగ్రెస్ పార్టీ చారిత్రక నిర్ణయం తీసుకుంది. అన్ని పార్టీల నిర్ణయంతో అసెంబ్లీలో కులగణనపై కేబినెట్ ఒక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ అమలు చేసింది. దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ నిలిచింది.

– ఎంఎస్ రాజ్‌ఠాగూర్, రామగుండం ఎమ్మెల్యే

రాజన్న బోర్డు ఏర్పాటు చేయండి



ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: తిరుమల తిరుపతి తరహాలో వేములవాడ రాజన్న ఆలయానికి బోర్డు, పట్టణంలో సాంస్కృతిక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. వేములవాడ ఆలయ ఆదాయం రూ.189 కోట్లుగా ఉంటుంది. గత ప్రభుత్వం రంగురంగుల బ్రౌచర్లలో అభివృద్ధి చూపించింది తప్ప ఒక్క ఇటుక కూడా కొత్తది పేర్చలేదు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెనక్కి వెళ్లిన రూ.20 కోట్ల వీటీడీఏ నిధులను తిరిగి తెప్పించి బద్దిపోచమ్మ ఆలయం వద్ద పనులు ప్రారంభించాం. రూ.35 కోట్లతో నిత్యాన్నదాన సత్రానికి శంకుస్థాపన చేశాం. ఆలయ నుంచి వెయ్యి మీటర్ల వరకు రెంతస్తుల భవనాల నిర్మాణం చేయకుండా జీవో తెచ్చారు. దాన్ని సవరించాలి.

– ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే

క్లుప్తంగా

అప్పల బాధతో రైతు ఆత్మహత్య


రాజం (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తికి చెందిన మతులపురం రాజం (55) అప్పుల బాధతో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రాజంకు ఎకరంన్నర సొంత భూమి ఉంది. దాంతోపాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. దిగుబడి సరిగా రాకపోవడంతో అప్పులు పెరిగిపోయా యి. ఈ క్రమంలో తనకున్న ఎకరం భూమి అమ్మి కొంత అప్పు చెల్లించాడు. ఇంకా రూ.10లక్షల వరకు అప్పు ఉంది. ఆ మొత్తం ఎలా చెల్లించాలా అని నిత్యం మదనపడుతున్నాడు. మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై సదాకర్ తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడుతాం

జగిత్యాలరూరల్: ప్రభుత్వ భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని నర్సింగాపూర్ శివారులోగల సర్వేనంబరు 437, 251లో అసైన్డ్ భూములను క్రయవిక్రయాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ధరణి పోర్టల్‌లో పట్టా చేసుకున్న వారి నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పహాణీలో డైరెక్ట్ ఎంట్రీలో సర్వేనంబరు 437లో 71.13 ఎకరాల, 251 సర్వేనంబరులో 19.07 ఎకరాల విస్తీర్ణం గల ప్రభుత్వ భూమికి సంబంధించిన పట్టాలను రద్దు చేసి స్వాధీనం చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. ముగ్గురు రైతులు స్వచ్ఛందంగా 3.15 ఎకరాల భూమిని ప్రభుత్వానికి స్వాధీనం చేశారని తెలిపారు.

ద్విచక్రవాహనం పైనుంచి పడి యువకుడి మృతి

చిట్యాల: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో కిందపడి ఓ యువకుడు చనిపోయాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం లక్ష్మీపూర్‌తండా గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోతనవేన అజయ్‌కుమార్(24) వ్యక్తిగత పనుల నిమిత్తం చిట్యాల మండలం ఒడితల నుంచి మోరంచపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. లక్ష్మీపూర్ తండా గ్రామం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించగా అప్పటికే అజయ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరించారు.

ఇటలీలో ఎల్లారెడ్డిపేట వాసి..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉపాధి కోసం ఇటలీ దేశానికి వెళ్లిన ఓ వలస జీవి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేటలో విషాదం నింపింది. మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ రషీద్(47) రెండేళ్ల క్రితం ఇటలీకి వెళ్లాడు. కారు డ్రైవింగ్ చేస్తుండగా ప్రమాదానికి గురై సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయం అక్కడి మిత్రులు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా మంగళవారం సమాచారం అందించారు. రషీద్ కుటుంబ సభ్యులు కొంతకాలంగా సిద్దిపేటలో ఉంటున్నారు. రషీద్ మృతదేహం బుధవారం ఎల్లారెడ్డిపేటకు రానుంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళా సంఘాలకు ఎన్నికలు

- కసరత్తు చేస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ
- ఈనెల లోపు పూర్తయ్యేలా ప్రక్రియ
- జిల్లాలో 1,72,614 మంది సభ్యులు

జగిత్యాల: మహిళాసాధికారత కోసం గతంలో స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేశారు. ఆ సంఘాలకు ఓ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు ఉంటారు. తాజాగా కొత్త అధ్యక్షులను ఎంపిక చేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. సంఘం సభ్యుల నుంచి గ్రామ, మండల, జిల్లా సమైక్యలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణపై మండలాల్లోని ఏపీఎం, సీసీ, డీఆర్డీఏ సిబ్బందికి జిల్లాలోని డీఆర్డీఏ కార్యాలయంలో శిక్షణ కల్పించారు. ఏపీఎంలు గ్రామస్థాయిలో వెళ్లి మహిళా సంఘాల అధ్యక్షుల ఎన్నికపై సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతమున్న అధ్యక్ష, ఉపాధ్యక్షుల పదవి కాలం ఈనెల 31తో ముగియనుండటంతో ఆ లోపు కొత్తవారిని ఎన్నుకోనున్నారు. జిల్లాలో 20 మండలాల్లో 14,957 మహిళా సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,72,614 మంది సభ్యులున్నారు. ఈ గ్రూపులకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు.

కొత్తవారికి అవకాశం

మహిళాసంఘాల్లో కొత్తవారికి అవకాశం కల్పించే దిశగా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. వీరికి జిల్లా, మండలం, గ్రాస్థాయిలో కార్యవర్గాలున్నాయి. గ్రామస్థాయిలో ఒక్కో మహిళాసంఘానికి ఇద్దరు లీడర్లు, పాలకవర్గ సభ్యులుంటారు. అలాగే గ్రామ సమైక్యకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల చొప్పున ఐదుగురితో కార్యవర్గం ఉంటుంది. అలాగే మండల, జిల్లా సమైక్య కార్యవర్గాలుంటాయి. ఏటా మార్చిలో కొత్తవారికి అవకాశం కల్పిస్తుంటారు. ఇప్పుడున్న కార్యవర్గాలన్నింటినీ రద్దు చేసి కొత్త వారికి అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక స్వయం సహాయక సంఘంలో 10 నుంచి 15 మంది వరకు మహిళా సంఘ సభ్యులుంటారు. వీరంతా కలిసి ఆసక్తిగా ఉండి.. చదువుకున్న సభ్యులను ఎన్నుకుని తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఇలా ప్రతి కార్యవర్గంలో ఆసక్తి గల వారిని అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యదర్శిని ఎన్నుకుంటారు.


సమావేశమైన మహిళలు(ఫైల్)

మహిళా సాధికారత కోసం..

మహిళాసంఘాలు ఏర్పడినప్పటి నుంచే వారు సాధికారత దిశగా పయనించాలనే దిశగా ప్రభుత్వం బ్యాంక్ లింకేజీ రుణాలతోపాటు, శ్రీనిధి రుణాలు కూడా అందిస్తుంటారు. మహిళలకు ఇందులో గ్రూపునకు, గ్రూపు సభ్యులకు లోన్లు అందిస్తుంటారు. మహిళలందరూ కలిసి గ్రూపుగా ఏర్పడి చిన్నచిన్న వ్యాపారాలు పెట్టుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ఒక సభ్యుడికి సైతం రుణం అందుకుని చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరు క్రమం తప్పకుండా మళ్లీ ప్రతినెలా బ్యాంక్ లింకేజీ రుణం ఎత్తుకుంటే బ్యాంక్‌వారికి, శ్రీనిధి వారికైతే శ్రీనిధికి బ్యాంకుల్లో జమచేస్తుంటారు. వీరికి సంబంధించిన బ్యాంక్ లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాలు, ఏవీ ఇవ్వాలన్నా మహిళాసంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. జిల్లావ్యాప్తంగా స్త్రీనిధి బ్యాంక్ నుంచి లింకేజీ రుణాలు రూ.కోట్లలో లావాదేవీలు జరగడంతోపాటు, వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీరికి సోలార్ ప్లాంట్లు, ఇటుక బట్టీల వ్యాపారాలు, పచ్చళ్ల వ్యాపారాలు చేస్తున్నారు. వీటికి ప్రభుత్వం కూడా ప్రోత్సాహం అందిస్తూ రుణాలు అందించనుంది. వాటితో మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తున్నారు. నూతన కార్యవర్గం ఏర్పడితే మరింత ఉత్సాహంతో పనిచేస్తూ మహిళలు ఇంకా సాధికారత సాధించే అవకాశాలుంటాయి. మార్చి నెలలో జిల్లా సమైక్య ఎన్నికలు పూర్తి చేయనున్నట్లు డీఆర్డీఏ అధికారులు పేర్కొంటున్నారు.

శిక్షణ అందించాం



మహిళా సంఘాలకు నూతన కార్యవర్గాల ఏర్పాటుకు ఏపీఎం, సీసీలకు శిక్షణ అందించాం. ఈనెల వరకు ప్రస్తుతమున్న వారి పదవీకాలం ఉంది. అప్పటి వరకు పూర్తిగా ప్రణాళిక పూర్తి చేస్తాం. కొత్తవారికి అవకాశం ఇచ్చేలా చూస్తున్నాం. జిల్లాలో 14,957 మహిళా సంఘాలున్నాయి.

– రఘువరణ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

వేంకటేశ్వరస్వామి ఉత్తర, దక్షిణ దిగ్యాత్రలు


పోలీస్‌స్టేషన్‌లో పూజలందుకుంటున్న స్వామివారు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవేంకటేశ్వరస్వామి మంగళవారం దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల నుంచి విశేష పూజలు అందుకున్నారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్ స్వామివారికి పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారిని ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అశ్వవాహనంపై శోభాయాత్రగా తీసుకెళ్లారు. ఆలయ ఈవో శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులున్నారు.


దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలో శ్రీవేంకటేశ్వరస్వామివారి పల్లకీ మోస్తున్న పోలీసులు

విద్యార్థుల కళ్లకు సురక్ష

- కళ్లద్దాల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం
- చూపు లోపం ఉన్నవారికి మేలు

కథలాపూర్: కంటి సమస్య ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం వెలుగులు అందిస్తోంది. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వా రా సమగ్ర కంటి పరీక్ష, ఉచిత కళ్లద్దాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆర్‌బీ ఎస్‌కే వైద్యులు పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి చూపు మందగించిన వారిని గుర్తించి అద్దాలు అందించాలన్నది ఉద్దేశం.

జిల్లాలో 45,626 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

ఆర్‌బీఎస్‌కే వైద్యుల ఆధ్వర్యంలో జిల్లాలోని 828 ప్రభుత్వ విద్యాసంస్థలల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 45,626 మంది విద్యార్థులకు ఇటీవల కంటి పరీక్షలు చేశారు. వీరిలో 2,506 మంది విద్యార్థులకు కంటి సమస్యలు, దృష్టిలోపం మందగించి చదవడానికి, రాయడానికి ఇబ్బంది పడుతున్నట్లు నిర్ధారించారు. వీరికి తప్పనిసరిగా కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి ఆయా మండలకేంద్రాల్లోని పాఠశాలల్లో కళ్లద్దాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.


కథలాపూర్ కేజీబీవీలో విద్యార్థినులకు కళ్లద్దాలు అందిస్తున్న వైద్యాధికారి, టీచర్లు

ఉచితంగా కళ్లద్దాలు



ప్రభుత్వ విద్యాసంస్థలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల ఏడో తేదీ వరకు కంటి పరీక్షలు చేశాం. కంటి సమస్య ఉన్నవారిని గుర్తించాం. కళ్లద్దాలు రాగానే విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నాం. చూపు మందగిస్తే విద్యార్థులకు సరిగా అక్షరాలు కనిపించకపోవడంతో చదువుల్లో వెనుకబడే ప్రమాదముంది. కళ్ల సమస్యలుంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయవద్దు. వైద్యులను సంప్రదించాలి.

– సురేంద్ర కుమార్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి

నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన ఇద్దరి రిమాండ్

ఇల్లంతకుంట(మానకొండూర్): నకిలీ వైద్య సర్టిఫికెట్లను తయారుచేసిన ఓ ప్రభుత్వ ఉద్యోగి, మరో రిటైర్డ్ ఉద్యోగిలను మంగళవారం మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. గాలిపెల్లి పశువైద్యశాలలో కత్తి దేవమ్మ ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా రిటైర్డ్ అయి తన కూతురుకు ఉద్యోగం పెట్టించాలని భావించింది. ఈక్రమంలో చింతకుంటకు చెందిన వెటర్నరీ రిటైర్డ్ ఉద్యోగి జేరిపోతుల సంజీవ్‌ను సంప్రదించింది. సంజీవ్ ఆమె వద్ద రూ.32వేలు తీసుకుని మరొకరి వద్ద నకిలీ మెడికల్ బిల్లులు తెచ్చిచ్చాడు. వాటిని దేవమ్మ కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వ అధికారుల పరిశీలనలో నకిలీవని తేలడంతో కేసు పరిశీలించాల్సిందిగా ఇల్లంతకుంట ఎస్సైకి సమాచారం ఇచ్చారు. కత్తి దేవమ్మ, జేరుపోతుల సంజీవ్ నకిలీ మెడికల్ బిల్లులు సృష్టించినట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ కావడంతో ఇద్దరిని రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో గాలిపెల్లి పశువైద్యశాల డాక్టర్ కొండ ఇందిరా ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలోంచి చైన్ చోరీ

మెట్‌పల్లిరూరల్: ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన ఓ మహిళ మెడలో నుంచి దుండగుడు బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన మె ట్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం మునిపల్లికి చెందిన దొడ్డ రమ్య, నర్సయ్య దంపతులు మంగళవారం వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయానికి వచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని వంట చేసుకునే క్రమంలో వెల్లుల వైపు నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన దు ండగుడు రమ్య మెడలోని రెండున్నర తులాల బంగారు ఆభరణాలను లాక్కెళ్లాడు. భక్తుల సమాచా రంతో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది ఆలయం వద్దకు వెళ్లి ఆరా తీశారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు.

కలెక్టర్ ఆదేశించినా కదలని అధికారులు


సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్ (ఫైల్)

- నీటి సమస్యతో భక్తుల ఇబ్బందులు

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు శాశ్వత మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని స్వయంగా కలెక్టర్ ఆదేశించినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోలేదు. ఇది బాధాకరమైన విషయమని ఆలయ మాజీ చైర్మన్ ఇందారపు రామయ్య అన్నారు. ఆలయంలో ఈనెల 10 నుంచి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న విషయం తెల్సిందే. అయితే ఏర్పాట్లపై ఫిబ్రవరి 13న కలెక్టర్ అధ్యక్షతన వివిధశాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. సకల సౌకర్యాలు కల్పించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఇందులో ముఖ్యంగా తాగునీటి సమస్య. ఆ సమస్య తలెత్తకుండా చూడాలని రామయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బ్రహ్మగుండం నుంచి గడ్డ హన్మండ్లు ఆలయం వరకు పూర్వమున్న పాత పైప్‌లైన్ చెడిపోయిందని, మరమ్మతు చేస్తే సమస్య కొంత వరకు తగ్గుతుందని ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. దీనికి కలెక్టర్ స్పందించి అవసరమైన ప్రతిపాదనలు పంపిస్తే రూ.5లక్షలు మంజూరు చేస్తానని హామీ కూడా ఇచ్చారు. అయితే కలెక్టర్ సూచించిన విధంగా అధికారులు పాత పైపులైన్‌ను పరిశీలించి వెళ్లారు తప్ప అందుకు అవసరమైన నివేదికను తయారుచేయలేదు. దీంతో భక్తులు తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు నిత్యం వస్తున్న వేలాదిమంది భక్తులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు గోదావరిలో ఉన్న బావి మోటార్ ఐదు రోజుల క్రితం కాలిపోవడంతో నీటి సమస్య తీవ్రమైంది. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి ఆలయం ముందున్న సంపును నింపే ప్రయత్నం చేస్తున్నారని రామయ్య తెలిపారు. ఒకవేళ కలెక్టర్ సూచించినట్లు పైపులైన్‌కు ఎస్టిమేట్ తయారు చేస్తే నిధులు వచ్చేవని, తద్వారా సమస్య తలెత్తేది కాదని భక్తులు అంటున్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడు రోజుల జైలు

జగిత్యాలజోన్: ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ మంగళవారం తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ.15 వేల నష్టపరిహారం అందించాలని తీర్పులో సూచించారు. కొడిమ్యాల మండల పరిధిలోని ఓ గ్రామంలో ఒంటరిగా ఉన్న మహిళపై అడువాల నాగరాజు అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు 2017లో కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. నిందుతుడిపై కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణ సమయంలో సాక్ష్యాలు బలంగా లేకపోవడంతో కేసును 2022లో కొట్టివేశారు. ఈ క్రమంలో బాధితురాలు జిల్లా కోర్టులో అప్పీల్ చేశారు. కింది కోర్టు ఇచ్చిన తీర్పు.. కేసులోని సాక్ష్యాలను పరిశీలించి నిందితుడైన అడువాల నాగరాజుకు ఏడురోజుల జైలు, బాధితురాలికి రూ.15వేల పరిహారం అందించాలని జడ్జి తీర్పు చెప్పారు.

నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తికి ఆర్నెళ్ల జైలు

జగిత్యాలజోన్: నిర్లక్ష్యంగా వాహనం నడపడమే కాకుండా ఇతరులకు గాయాలు కావడానికి కారణమైన నిందితుడికి ఆర్నెళ్ల జైలు, రూ.9వేల జరిమానా విధిస్తూ జిల్లా రెండో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ వినీల్‌కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. గాయపడిన ఇద్దరు బాధితులకు రూ.30వేల చొప్పున పరిహారం అందించాలని కూడా తీర్పులో సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రజనీ కథనం ప్రకారం.. కొడిమ్యాలకు చెందిన పోతర్ల రవి 2019 మే 15న తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై వేములవాడ నుంచి కొడిమ్యాల వస్తున్నాడు. నల్గొండ లక్ష్మీనృసింహస్వామి గుడి వద్ద వేములవాడకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న మ్యాకల అంజయ్య అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న రవిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో రవి, ఆయన కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేసుకుని నిందితుడిపై కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో మ్యాకల అంజయ్యకు ఆర్నెళ్ల జైలు, రూ.9వేల జరిమానా విధించారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి


పాఠశాలల్లో తొలిమెట్టు అమలును పరిశీలిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట విద్య పరిశోధన శిక్షణ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పలు మండలాల్లోని పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు మంచి ఫలితాలు ఇవ్వాలన్నారు. ఆయన వెంట జిల్లా కో–ఆర్డినేటర్ రాజేశ్, డీఈవో రాము ఉన్నారు.

కనులపండువగా నృసింహస్వామి రథోత్సవం


రథం లాగుతున్న భక్తులు

రాయికల్: మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి రథోత్సవం మంగళవారం కనులపండువగా నిర్వహించారు. అర్చకులు దేవుని నారాయణ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథంపై ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ తిప్పారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

థాయ్‌లాండ్‌కు మరో విమానం

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కొలువుల కోసమని వెళ్లి థాయ్‌లాండ్ పరిసరదేశాల్లో సైబర్ కేఫ్‌ల్లో చిక్కుకు న్న యువతను ఇండియాకు తీసుకొచ్చే ఆపరేషన్ కొనసాగుతోంది. ఇటీవల అక్కడ చిక్కుకున్న యు వత దయనీయస్థితిని 'సాక్షి' వరుస కథనాలతో వె లుగులోకి తెచ్చింది. స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. అమిత్ షా ఆదేశాలతో మయన్మార్, థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న 540మంది భారతీయులను రెండు సైనిక వి మానాల్లో సురక్షితంగా ఢిల్లీకి తరలించారు. వారిని సీబీఐ, ఎన్ఐఏ, ఐబీ తదితర దర్యాప్తు సంస్థలు విచారించిన అనంతరం స్వరాష్ట్రాలకు పంపారు. తాజా సమాచారం ప్రకారం .. మరికొందరు భారతీ య యువతీ, యువకులు ఇంకా అక్కడ చిక్కుకుపోయారని, వారిని కూడా రక్షించేందుకు కేంద్ర హోంశాఖ మరో విమానాన్ని థాయ్‌లాండ్‌కు పంపనుందని సమాచారం. ఈ వారాంతంలోగా మరో విమానం ద్వారా వారిని తీసుకురానున్నారని తెలిసింది.

ఆరోగ్య కేంద్రాల సేవలపై అవగాహన


అసెస్మెంట్ పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

కోరుట్లరూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధి యెఖీన్‌పూర్‌లో జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆరోగ్య కేంద్రాల సేవలపై డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అవగాహన కల్పించారు. క్వాలిటీ అసెస్‌మెంట్ మేనేజర్ నాగరాజు ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ వసతులను వివరించారు. అనంతరం డీఎంహెచ్‌వో హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ నాణ్యతను పరీక్షించారు. వసతులు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో 168 రకాల మందులు ఉండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాలు 80 మార్కులు సాధిస్తే ఏటా రూ.1.25లక్షల చొప్పున మూడేళ్లపాటు నిధులు వస్తాయని, వాటి ద్వారా వసతులు కల్పించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాస్, సతీష్ కుమార్, సమీనా తబస్సుమ్, డీపీఓ రవీందర్, ఏఎంఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి

ఇబ్రహీంపట్నం: వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. హెల్త్ సబ్‌సెంటర్లలో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.